ద్వైమాస పత్రిక
వేకువ యోచన చేతన
# జాగో ఆన్‌లైన్
ఆగస్ట్-సెప్టెంబర్ 2019 బెల్లంపల్లి నుండి వెలువడుతున్న మొట్టమొదటి స్వతంత్ర మీడియా సంచిక 14

## ఏది నీ దారి?

ఎన్నో దారులు కనిపిస్తయ్...కానీ, ఏ దారికీ మనం పోలేము!

ఎక్కడెక్కడో వెలుగులు విచ్చుకుంటూనే ఉంటయ్..కానీ, మన చుట్టూ చీకటే కమ్ముకున్నట్టు ఉంటుంది.

మన నేస్తాలు బీ.టెక్., ఎంటెక్... అంటూ ఏవేవో చదివేస్తూనే (?) ఉంటారు. మనమే ఖాళీగా ఉంటాం.

వాళ్లంతా అక్కడి విశేషాలు ప్రపంచ వింతల్లా, మహాద్భుతాల్లా వివరిస్తా ఉంటారు. మనం మాత్రం అదే చీకట్లో... అదే అయోమయంలో... ముందుకు పోయే వాళ్లని చూస్తూ, ఉన్నచోటే ఉండిపోతాం.

ఎవరైనా తెలిసిన వాళ్లు కనిపిస్తే 'ఏం చేస్తున్నావం'టే... ఖాళీగా ఉన్నామని చెప్పలేక - అలాగని అబద్ధం చెప్పలేక పడే తండ్లాట నిజంగానే నరకంలాగ అనిపిస్తది.

ఏం చేయాలో తోచదు. ఏది చెయ్యాలన్న ఉత్సాహం ఉండదు.



ఏదో ఒక దశలో చదువు చతికిలపడ్డప్పుడు, చదవాలన్న ఆసక్తి చచ్చిపోయినప్పుడు... ఇదో - ఇలాగే ఉంటుంది మన పరిస్థితి.

ఒక్కోసారి చదివినా బాగుండన్పిస్తుంది. కానీ, చదవలేం. మళ్లీ వెంటనే లోకంలో అంతా చదివే బతుకుతున్నారా? అనిపిస్తుంది.

**నిజమే యార్!**

ఈ టాపర్లూ, ర్యాంకర్లతో మనకు పనిలేదు. మన దారి మనది. మన గోల మనది. చదువు మనకు దారి చూపనపుడు మన దారేంటో మనమే ఎంచుకోవాలి. 'నా రూటే సపరేటు' అంటే సరిపోదు. నీ దారేదో, అది నీకెలా ఉపయోగపడుతుందో వివరంగా చెప్పగలగాలి. బతకటానికి ఏదో పని చేస్తూ, నీ గమ్యాన్ని చేరేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి. ఆ మ్యాప్‌కి అనుగుణంగా నీలో మార్పులు రావాలి. ఇవన్నీ కలిసి, అంతిమ విజయానికి దారి తీయాలి.

**"చదువే జీవితం కాదు. కానీ, నీకేది జీవితమో నువ్వే నిర్ణయించుకోవాలి. దాన్ని నువ్వే సాధించుకోవాలి"**

ప్రేమతో మీ భరత్ రుషి

స్వతంత్ర దినోత్సవ, బక్రీద్, రాఖీ పౌర్ణమి,
వినాయక చవితి మరియు మొహర్రం
శుభాకాంక్షలు

# గురువు

**ఉపాధ్యాయుడంటే కేవలం పుస్తకాల్లో పాఠాలు చెప్పేవారు కాదు. ఆణిముత్యాల వంటి ఆదర్శపౌరులను తయారుచేసే అపరబ్రహ్మలు.**

ఏ దేశ సంక్షేమమైనా, ఏ జాతి సౌభాగ్యమైనా ఆ దేశంలోని ఉపాధ్యాయుల ఆదర్శంపైనే ఆధారపడి ఉంటుంది. దాదాపు 1970 సం॥ వరకు మన దేశంలో ఆదర్శ గురువుల సంఖ్య గణనీయంగా ఉండేది. ఆనాటి గురువులు కేవలం పుస్తకంలోని పాఠాలు చెప్పటానికి పరిమితం కాకుండా, జీతం కోసం పని చేసే ఉపాధి ఉపాధ్యాయులుగా కాకుండా ఆణిముత్యాల వంటి ఆదర్శభావి భారతపౌరులను తయారుచేయడమే జీవిత ధ్యేయంగా పనిచేసేవారు.

మన భారతీయ సంస్కృతిలో తల్లీ తండ్రీ తరువాతి స్థానం గురువుకే ఇవ్వబడింది.

నవమాసాలు మోసి, రక్తమాంసాలు ధారపోసి కనేది తల్లి. కాబట్టి, ఆమె ప్రథమ దైవం. బిడ్డ పెరగటానికి అవసరమైన సమస్త సౌకర్యాలు అందించి, పోషించేవాడు తండ్రి. కాబట్టి, ఆయన ద్వితీయ దైవం. విద్యాబుద్ధులు నేర్పి, విజ్ఞానవంతుడిగా తీర్చిదిద్దేవాడు ఆచార్యుడు. కాబట్టి, అతను తృతీయ దైవం.



ఉపాధ్యాయ వృత్తిని సామాజిక బాధ్యతగా భావించి పనిచేయాలి. విద్యార్థులకు పాఠాలతో పాటూ లోకజ్ఞానాన్ని పెంచేందుకు అవసరమైన అంశాలను బోధించాలి. అందుకు అవసరమైన విజ్ఞానాన్ని ముందుగా గురువు పెంచుకోవాలి. గురువు యొక్క భాష, వేషధారణ, అలవాట్లు, ప్రవర్తన విద్యార్థులకు ఆదర్శంగా ఉండేలా జాగ్రత్తపడాలి.

విద్యార్థులలో దేశభక్తిని కలిగించే వీరోచిత గాథలను, వీరుల చరిత్రలను బోధించాలి. పిల్లలందరి అభిరుచులనూ, ప్రతిభా స్థాయిని తెలుసుకుని, అందుకు తగిన రీతిలో తన బోధనా పద్ధతులను మార్చుకోవాలి.

పాఠ్యాంశాలలో సందర్భానుసారంగా హాస్యం మరియు ఉపమానాలను జోడిస్తూ, వారికి పాఠంపై ఆసక్తి కలిగించేలా బోధించాలి. అశ్రద్ధగా ఉండే విద్యార్థులను ఎదురుగా కూర్చోబెట్టుకుని, వారిని ఎగతాళి చేయకుండా ప్రోత్సహించాలి.

మన దేశానికి సంబంధించి, గొప్ప గురువులలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది - చాణక్యుడి గురించి. మొదటి మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ప్రధాన మంత్రి. కౌటిల్యుడు మరియు విష్ణుగుప్తుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. చాణక్యుడి తన మేధతో చంద్రగుప్తుని తిరుగులేని చక్రవర్తిని చేసాడు. అసామాన్యమైన అతని పాలనా దక్షత వల్లనే మౌర్య సామ్రాజ్యం చాలా పురోగతి సాధించింది.

**చాణక్యుడు చెప్పిన కొన్ని గొప్ప జీవిత సత్యాలు**

- దేవుడు విగ్రహాల్లో ఉండడు. మీ భావాలే - దేవుడు. మీ ఆత్మయే ఆలయం.
- ఎలాంటి పరిస్థితుల్లోనూ మనల్ని మనం గొప్పవారిగా భావించకూడదు.
- ఇతరుల పొరపాట్ల నుండి నేర్చుకో. అన్నింటిని నీ అంతట నువ్వే తెలుసుకోవాలంటే నీకు జీవితకాలం సరిపోదు.
- మీకు సంబంధించిన అన్ని రహస్యాలను అందరితో పంచుకోవద్దు. అది మిమ్మల్ని నాశనం చేస్తుంది.
- మీరు కొత్త పనిని ప్రారంభించేటపుడు ఈ మూడు ప్రశ్నలను వేసుకోవాలి.

  1 ఎందుకు ఈ పని చేస్తున్నాను?

  2 దాని ఫలితం ఏంటి?

  3 అందులో గెలిస్తే ఏం చేయాలి? గెలవకపోతే ఏం చేయాలి?
- ఒక ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన సాధించదలచుకున్న ప్రయోజనం నుండి వెనుకంజ వేయద్దు.
- ప్రపంచంలో అందరూ స్వలాభాన్నే కోరుకుంటారు. ఎప్పటి వరకు మన నుండి జనానికి లాభం ఉంటుందో అప్పటి వరకే మనకు విలువ ఉంటుంది.
- నిజాయితీ లేని, తెలివితేటలు లేని వ్యక్తితో వ్యాపారం చేయడం మంచిది కాదు. మీకు తెలియకుండానే అతను మీ జీవితాన్ని నాశనం చేసే అవకాశం ఉంది.

చిత్రం

# సాహో అనిపిస్తుందా?

**దాదాపు రు.300 కోట్ల భారీ బడ్జెట్...**
**బాహుబలి తరువాత ప్రభాస్ నుండి వస్తున్న సినిమా...**
**టాలీవుడ్, బాలీవుడ్‌కి చెందిన భారీ తారాగణం...**
**వెరసి - అది " సాహో " చిత్రం ! ఆగస్ట్ 30న విడుదల కానున్న ఈ చిత్రం యొక్క విశేషాలూ, విశ్లేషణ...**

### అతనిపై ఇంత 'భారీ' నమ్మకమా?

రు. 300 కోట్ల బడ్జెట్‌తో తెలుగు సినిమా తీస్తున్నారంటేనే ఇండస్ట్రీ జనాలతో పాటూ మామూలు జనాలు కూడా 'వామ్మో..!' అనుకున్నారు. పైగా, దర్శకుడు కూడా, ఏ రాజమౌళి లాంటి సీనియరో కాదు. కేవలం, రన్ రాజా రన్ లాంటి ఒకే ఒక్క సినిమా తీసిన సుజీత్! అంటే, కొత్త దర్శకులు చేయలేరని కాదు. వాళ్ల దగ్గర ప్రతిభ ఉండదని కాదు. ఇంత వరకూ మనోళ్లెవరూ అంత సాహసం చేయలేదని. ఇలాంటి ప్రాజెక్ట్ చేయడమంటే ఏ దర్శకుడికైనా చాలా ఒత్తిడి ఉంటుంది. మరి, సుజిత్ దాన్ని ఏవిధంగా అధిగమించాడో, అందులో ఎంత వరకూ సఫలీకృతుడయ్యాడో చూడాలిక!




### కథేంటసలు...

కథ గురించి చిత్ర బృందం ఎలాంటి క్లూ ఇవ్వనప్పటికీ, గత నెలలో విడుదలైన టీజర్‌ని బట్టి చూస్తే, ఎవరూ లేని హీరోయిన్ కోసం హీరో చేసే పోరాటమే చిత్రంలో ప్రధానాంశం అనుకోవచ్చు. ప్రోమోలన్నీ యాక్షన్ ప్రధానంగా ఉన్నప్పటికీ, మన కథలు ఎటు తిరిగీ హీరో బిల్డప్, ప్రేమ చుట్టూనే తిరుగుతాయి. కాబట్టి, పై పై హంగులూ, హంగామాలూ ఎన్ని కనిపించినా, మొత్తంగా ఇదొక మామూలు ప్రేమ - ప్రతీకారం కథ మాత్రమే అయ్యుండొచ్చు.

### ఎవరెవరున్నారంటే...

ప్రభాస్‌కి ఉన్న క్రేజ్ దృష్ట్యా సాహోని తెలుగుతో పాటూ తమిళ, హిందీ భాషల్లో రూపొందించాలని ముందుగానే మేకర్లు అనుకున్నారు. కాబట్టి, ఆయా భాషలకు చెందిన నటులను ఎంచుకున్నారు. జాకీష్రాఫ్, నీల్ నితిన్, ఎవ్లిన్ శర్మ, మందిరా బేడీ, అరుణ్ విజయ్ లాంటి తారలు కనువిందు చేయనున్నారు. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చనైన చందంగా మారుతుందని గతంలో చాలా చిత్రాలు రుజువు చేశాయి. ఇప్పుడు మరి ఈ చిత్రం కూడా అదే కోవలోకి చేరుతుందా?

### ఒక్క సీన్..ఒకే ఒక్క సీన్...

మేకింగ్ వీడియోల్లో అయినా, పోస్టర్లలో అయినా ప్రధానంగా అబుదాబిలో చిత్రీకరించిన యాక్షన్ ఎపిసోడ్‌నే హైలెట్ చేసారు. రు. 40 కోట్ల బడ్జెట్‌తో వేసిన ప్రత్యేక సెట్‌లో, 400 మంది చిత్ర బృందం, 30 రోజుల పాటూ ఈ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరించారట. దీని కోసం ప్రత్యేకంగా కొన్ని ట్రక్కులను కూడా రూపొందించారట. హాలీవుడ్ యాక్షన్ కెన్నీ బేట్స్ నేతృత్వంలో బుర్జ్ కలీఫా, రాస్ అల్ ఖైమా, వరల్డ్ ట్రేడ్ సెంటర్, అబుదాబిలోని ఎతిహాడ్ టవర్ తదితర ప్రాంతాల్లో ఈ సన్నివేశాలని తీసారట. చిత్రంలో ఈ సన్నివేశాలు చాలా సహజంగా, ఎలాంటి డూప్ లేకుండానే రూపొందించినట్లు, అవే చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర రూపకర్తలు మొదటి నుండి చెబుతున్నారు. కానీ, కేవలం 10 నుండి 15 నిమిషాలు మాత్రమే ఉండే సన్నివేశాలకి అంత ఖర్చు, బిల్డప్ అవసరమా? అని కొందరు పెదవి విరుస్తున్నారు. నిజమే కదా! సహజత్వం, భారీతనం కనపించాలన్న ఇదితో... చిత్రంలో ఒక చిన్న పార్ట్‌కే నిర్మాణ వ్యయం ఇలా తడిసి మోపెడు ఐతే, చిత్ర నిర్మాణం అంటే భయపడే పరిస్థితి రాదా!




### సంగీతం సంగతేంటి మరి..?

ఈ చిత్రానికి ముందు బాలీవుడ్ సంగీత త్రయం శంకర్-ఎహసాన్-లాయ్ లు సంగీత దర్శకులుగా వ్యవహరించారు. దాదాపు 70 శాతం పని పూర్తయ్యాక వారు చిత్రం నుండి తప్పుకున్నట్లు ప్రకటించారు. కారణాలేమిటన్నది వారు కానీ, చిత్ర బృందం కానీ వెల్లడించలేదు. అయితే, వారు రికార్డ్ చేసిన పాటలు, రీ-రికార్డింగ్ నిర్మాతలకు నచ్చలేదని ఒక

వార్త అయితే ప్రచారంలో ఉంది. సరే, కారణాలేవైనా విడుదలకు 2 నెలల ముందు ఇలా జరగడం, మళ్లీ కంపోజింగ్, రీ-రికార్డింగ్ అంతా చేయడమంటే తలకు మించిన భారమే. కాబట్టి, ఆర్.ఆర్. మాత్రం యథాతథంగా ఉంచారు.

మొదటి మేకింగ్ వీడియోకి థమన్, రెండోదీ మరియు టీజర్‌కీ జిబ్రాన్ బ్యాగ్రౌండ్ స్కోర్ చేసారు. మిగతా పాటలను ఒక్కో పాటను ఒక్కో సంగీత దర్శకుడితో చేయించారు. ఇప్పటికి రెండు పాటలను విడుదల చేయగా, వాటిలో సైకో సయ్యాన్ పాటకి తనిష్క్ బాగ్చి, రెండో పాటకి గురు రంధ్వా సంగీతం అందించారు. అయితే, ఈ రెండు పాటలూ మన జనాలని అంతగా ఆకట్టుకోలేదనే చెప్పాలి. సంగీతమే కాదూ, సాహిత్యం, చిత్రీకరణ కూడా ఎవరికీ అంతగా ఎక్కేలా లేదు.

ఈ చిత్ర ఆడియో వేడుకను దేశంలోని ముఖ్య నగరాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు సమాచారం. ఆగస్ట్ 17న హైదరాబాద్‌లో, 21న కొచ్చిన్‌లో, 25న బెంగళూర్‌లో, 27న ముంబైలో పాటలను విడుదల చేయాలనుకుంటున్నారు.




## ప్రేక్షకులను చేరని ప్రచారం

అప్పుడెప్పుడో 'ఇట్స్ షో టైమ్' అంటూ ఓ ప్రోమో వదిలారు. అప్పటికి బాహుబలి ఊపు ఉంది. ఈ ప్రోమోతో అది కొనసాగింది. కానీ, తరువాత చిత్రం గురించి ఎలాంటి ఊసూ లేదు. జనాల్లో కూడా చిత్రంపై ఆసక్తి తగ్గిపోయింది.

మళ్లీ చాన్నాళ్లకి ఓ ఫస్ట్ లుక్ - అది కూడా పెద్ద ఆకట్టుకునేలా ఏం లేదు - దాని తరువాత, హీరో, హీరోయిన్ల పుట్టిన రోజు సందర్భంగా, సాహో షేడ్స్ చాప్టర్ 1,2 అనేసి ఓ రెండు మేకింగ్ వీడియోలు విడుదల చేశారు. కాస్త బజ్ వచ్చిందనుకుంటే మళ్లీ ఎలాంటి చిత్ర విశేషాలు లేవు.

ఇక, మొన్న మొన్న, జూలైలో ఓ టీజర్, రెండు పాటల్ని వదిలారు. త్వరలో 'సాహో - ది గేమ్' పేరుతో ఓ వీడియో గేమ్‌ని తెచ్చే పనిలో ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. ఇదే ఇంత వరకూ సాహో చిత్ర బృందం చేసిన ప్రచారం.

## కాపీ వివాదాలు

మొదటి నుండీ సాహో చిత్రంపై కాపీ వివాదాలు ముసురుకుంటూనే ఉన్నాయి. కొన్ని హాలీవుడ్ చిత్రాల పోస్టర్లను అచ్చు గుద్దేసినట్లు ఉంటున్నాయి ఈ చిత్ర పోస్టర్లు.

ప్రభాస్ మాస్క్ ధరించి ఉన్నటువంటి ఫస్ట్‌లుక్ పోస్టర్, 'బ్లేడ్ రన్నర్ : 2049' పోస్టర్‌కి కాపీ అని నెటిజన్లు ట్రోలింగ్ చేసారు. అలాగే,



మరో పోస్టర్ 'బ్రేకింగ్ బ్యాడ్' అనే టివి సిరీస్ పోస్టర్ అనీ, గత నెలలో విడుదల చేసిన హీరో-హీరోయిన్లు ఫైరింగ్ చేస్తున్న పోస్టర్, 'రెయిన్ బో సిక్స్ సెయిజ్' అనే వీడియో గేమ్ పోస్టర్‌కీ కాపీ అనీ ట్రోల్ చేస్తూనే ఉన్నారు.

అలాగే, త్వరలో విడుదల కానున్న సాహో వీడియో గేమ్ పోస్టర్‌ని




కూడా 'రెడీ ప్లేయర్' చిత్రం పోస్టర్‌కి మక్కికి మక్కీ దించేసారు. ఇలా సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నా సాహో బృందం మాత్రం కాపీ పోస్టర్లను వదలటం ఆపట్లేదు.

## విడుదలపై వీడని అనుమానాలు

ఓ పక్క చిత్రీకరణ, మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. అయినప్పటికీ చిత్రం విడుదలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా స్వతంత్ర దినోత్సవం సందర్భంగా, ఆగస్ట్ 15న చిత్రాన్ని విడుదల చేస్తామని ప్రకటించారు. కానీ, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా ఆగస్ట్ 30కి వాయిదా వేసారు. కానీ, అప్పటికి కూడా చిత్రం విడుదలవుతుందా? అన్నది సందేహమే.

## అంతిమ ఫలితం..?

మసాలా రుచి బాగుంది కదా అని మిగతా దినుసులని తగ్గించి, ఒక్క మసాలానే ఎక్కువగా వేస్తే కూర ఎలా తయారవుతుందో...కథ, కథనాల్లో పట్టు లేకుండా కేవలం భారీతనం మీద మాత్రమే దృష్టి పెడితే తయారయ్యే చిత్రం కూడా అలాగే ఉంటుంది. విడుదలకు ముందు ఇంతలా హంగామా చేసిన చిత్రాలు విడుదల తరువాత చతికిలబడ్డ సందర్భాలే ఎక్కువ. మరి, సుజిత్ 'సాహో' అనిపిస్తాడా? నిరాశపరుస్తాడా? కనీసం అభిమానులనైనా తృప్తి పరుస్తాడా? అన్నది ఆగస్ట్ నెలాఖర్లో తెలుతుంది

# యూట్యూబ్ కి సెన్సార్ అక్కర్లేదా?

**మొదటి నుండీ యూట్యూబ్ అంటే వీడియోల అడ్డా. కాలక్షేపానికి మాత్రమే పనికొచ్చేది. రాను రానూ ప్రతిభ ఉండీ, దాన్ని నిరూపించుకునే అవకాశం కోసం చూస్తున్న వారికి అద్భుతమైన వేదికగా మారిపోయింది. ముఖ్యంగా చిత్ర పరిశ్రమలో తమ సత్తా చాటాలనుకునే వారికి కేరాఫ్ అడ్రస్ అయిపోయింది. ఇది ఒక విధంగా మంచి పరిణామమే. కానీ, తొండ ముదిరి ఊసరవెల్లి అయిన కతని తలపిస్తోంది.**



### ఓపెన్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఆల్

ఒకప్పుడు నటులుగా, దర్శకులుగా తమని తాము నిరూపించుకోవాలనుకుంటే... స్టూడియోల చుట్టూ, నిర్మాతల చుట్టూ తెగ తిరగాల్సి వచ్చేది. అయినా, గ్యారంటీ ఉండేది కాదు. పైగా, ఛీత్కారాలూ, అవమానాలూ ఎదుర్కోవాల్సి వచ్చేది. అదే ఇప్పుడైతే, ఒక సెల్‌ఫోన్, ఇద్దరు, ముగ్గురు ఫ్రెండ్స్ ఉంటే చాలు. ఒకడు హీరో, ఒకడు డైరెక్టర్, ఇంకోకడు కెమెరామన్, ఎడిటింగ్‌కి అప్స్ ఎలాగూ ఉన్నాయి. చేతిలోనే ఒక షార్ట్ ఫిల్మ్ తయారైపోతుంది. సొంతంగా యూట్యూబ్ ఛానెల్ క్రియేట్ చేసుకుని, అప్‌లోడ్ చేసేస్తే సరి. క్లిక్ అయితే... లైక్సూ, కామెంట్లతో జనాల స్పందన కూడా నేరుగా తెలిసిపోతుంటుంది. కలిసొచ్చిందా... ఇండస్ట్రీ నుండి పిలుపు కూడా రావొచ్చు, లేదా యూట్యూబ్ స్టార్‌గా బోల్డంత క్రేజ్. ఎంత మంచి అవకాశం కదా!

ఈవిధంగా యూట్యూబ్‌ని సరిగ్గా వాడుకుంటే... పేరూ, డబ్బుతో పాటూ సెలబ్రెటీ హోదా కూడా వచ్చేస్తుంది. అలా చిత్ర పరిశ్రమలో అవకాశాలు సాధించుకున్న నటీనటులూ, దర్శకులూ కూడా ఉన్నారు. ఈ మధ్య కాలంలో తెలుగు చిత్ర సీమకొచ్చిన కొత్త దర్శకులంతా లఘు చిత్రాల ద్వారా ఫేమ్ అయినవారే.

ఫణీంద్ర నర్సెట్టి (మను), ప్రశాంత్ వర్మ (అ!, కల్కి), తరుణ్ భాస్కర్ (పెళ్లి చూపులు), సుజిత్ (రన్ రాజా రన్, సాహో), శివ నిర్వాణ (నిన్ను కోరి, మజిలీ), హను రాఘవపూడి (అందాల రాక్షసి, కృష్ణగాడి వీరప్రేమగాథ, చిత్ర లహరి)... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది.

నటీనటుల విషయానికొస్తే... రాజ్ తరుణ్ (కుమారి 21ఎఫ్), రాహుల్ రామకృష్ణ (అర్జున్ రెడ్డి), పూజిత పొన్నాడ (వేర్ ఈజ్ వెంకటలక్ష్మి, కల్కి), చాందినీ చౌదరి (హౌరా బ్రిడ్జ్, మను) వంటి వాళ్ళు.

### వాస్తవికత పేరుతో...

ఏ రంగంలో అయినా... ఒక్కో సమయంలో ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. అలా ఇప్పుడు అంతటా వాస్తవికత, స్థానికత అనేవి ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఏదైనా రియలిస్టిక్ ఉండాలి, పక్కా లోకల్ మాల్ అన్నట్టు ఉండాలి అనుకుంటున్నారు. అలా అని చెప్పేసి, ఇష్టారీతిన వ్యవహరించేస్తున్నారు. ఏమైనా అంటే 'దునియా అట్లే ఉంది.. అదే చూపిస్తున్నాం. అందులో తప్పేముంది?' అంటున్నారు.

### పేరు కోసం అడ్డదారులు...

ఒక యూట్యూబ్ ఛానెల్ ఉంది. అది తక్కువ సమయంలో బాగా పాపులర్ కావాలి. సబ్‌స్క్రైబర్లు పెరగాలి, లైక్స్, కామెంట్స్, షేర్స్ బాగా రావాలి. అంటే ఏం చేయాలి? సాధారణంగా అయితే, ఎవరైనా మంచి కంటెంట్ పెట్టాలనుకుంటారు. కానీ, చాలా మంది ఏం చేస్తున్నారంటే... అసభ్యత, ద్వంద్వార్థాలను జంకూ గొంకూ లేకుండా చొప్పించేస్తున్నారు. యూట్యూబ్‌కి సెన్సార్ లేకపోవడం వల్ల పచ్చిగా మాట్లాడేస్తూ, చూపించేస్తూ అదే గొప్ప అనుకుంటున్నారు.

**'బయట జనాలు ఎలా ఉన్నారో అలాగే మా వీడియోల్లోనూ ఉన్నారు. జనాలు సాధారణంగా ఎలా మాట్లాడుతారో అలాగే మా వీడియోలో పాత్రలు మాట్లాడుతాయి. వీడియోలో ఉన్న మెసేజ్‌ని పట్టించుకోకుండా కేవలం బూతుల్నే చూస్తే ఎలా?' - ఇదీ వాళ్ళ తర్కం.**

సహజత్వం అంటే అసభ్యతేనా !? పక్కా లోకల్ వినోదం అంటే రాయలేని, చెప్పలేని మాటలు మాట్లాడటమా? అలాంటి మాటలు మాట్లాడుతూ వీళ్ళిచ్చే సందేశం ఏంటి? అసలు సందేశమే ఇచ్చేటట్టయితే... బూతుల అవసరమేముంది? చూసేవాళ్ళు వాటిని ఎంజాయ్ చేస్తారు తప్ప, ఎవరైనా అందులోని సందేశాన్ని అర్థం చేసుకుంటారా !?




### పీరియడ్స్ గొడవ...

ఇందాక చెప్పుకున్నట్టు కేవలం ఇద్దరు బోల్డ్ లేడీస్, వాళ్ళ బూతులతో బాగా పాపులర్ అయిన ఒక ఛానల్ ఉంది.వాళ్ళు మొదటి నుండీ అదో టైపు వీడియోలు తీస్తుంటారు. డబుల్ మీనింగ్ కాదు... డైరెక్ట్ పదాలనే యథేచ్ఛగా వాడేస్తుంటారు.

తాగటం, వాగడం తప్ప వాళ్లకు వేరే పని కూడా లేదన్నట్టు వ్యవహరిస్తుంటారు. అలాంటి వాళ్లు తీయక తీయక ఒక మంచి వీడియో తీసారు. టాపిక్ వచ్చేసి - ప్రతి అమ్మాయీ ఎదుర్కొనే - పీరియడ్స్.




అనాది నుండి స్త్రీ లోకం ఎదుర్కొంటున్న ఆ సమస్యని, వాళ్ల ఇబ్బందినీ, ఆ సమయంలో వాళ్లని అంటరాని వాళ్లలాగా చూడటం ఎంత తప్పో, అలా కాకుండా ఏం చేయొచ్చో చక్కగా చెప్పారు. నిజంగా ఆ ఛానెల్‌లో చేసిన మిగతా వీడియోలలో చెప్పుకోడానికి ఏమీ లేదు. కానీ, ఈ ఒక్క వీడియో మాత్రం చాలా బాగుందనే చెప్పాలి. ఒక్క చెడ్డ మాట లేకుండా సింపుల్‌గా, స్ట్రెయిట్‌గా విషయాన్ని వివరించటం చెప్పుకోదగ్గ అంశం.

అయితే, అందులో నటించిన అమ్మాయి పేరు దగ్గర పేచీ వొచ్చింది కొందరికి. అది మార్చేయ్యాలని గొడవ చేసారు. ఇకనేం, మీడియాకి కావల్సిన స్టఫ్ దొరికినట్లయ్యింది. రెండు వర్గాలనీ స్టూడియోలో కూచోబెట్టి, చర్చాగోష్టికి తెర లేపాయి. కానీ, దాని వల్ల ఎవరికి, ఏం ఒరిగింది? అంటే ఏమీ లేదు.




మొదట్నుండీ ఆ యూట్యూబ్ ఛానెల్‌లో అన్ని బూతులు మాట్లాడుతుంటే... అది తప్ప కాదు. ఆ వీడియోల ద్వారా పిల్లలు అలాంటి తప్పుడు మాటలు నేర్చుకుంటారని కాదు. ఆ ఛండాలమైన వీడియోలు యువతకు తప్పుడు సందేశాన్ని ఇస్తున్నాయనీ కాదు. కేవలం ఒక్క పేరుతోనే సమస్య వచ్చిందట వాళ్లకు. దానికే ఓ రాద్ధాంతం చేసారు.

ఇదొక్కటే కాదు... ఇలాంటి ఛానెల్స్ ఇంకా ఉన్నాయి. మీడియా కూడా అనవసరంగా డిబేట్లు పెట్టి కాలక్షేపం చేస్తూ, టీఆర్‌పి రేటింగ్స్ పెంచుకోవడం కోసమే ఇలాంటి విషయాలని హైలెట్ చేస్తూ వస్తోంది.

### వినోదం అంటే 'అదే'నా?

'ఈరోజుల్లో సందేశాలిస్తే ఎవరు చూస్తారండీ. జనాలకు కావాల్సింది వినోదం' అంటారు చాలా మంది. నిజమే... కానీ, **వినోదం అంటే అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి మందు కొట్టడాలూ, విచ్చలవిడిగా తిరగడాలూ, సభ్యత లేకుండా పచ్చిగా మాట్లాడుకోవడాలూ.... తరహా ఛండాలమేనా?!**

వినోదం పేరుతో విలువల్ని గాలికొదిలేయడం సరైందేనా?

**సందేశాలు మాత్రమే ఇవ్వమని ఎవ్వరూ చెప్పట్లేదు. ఏదైనా తీయండి... కానీ, అది ఆహ్లాదంగా ఉండాలి. చిన్నా, పెద్దా అందరూ ఆస్వాదించేలా, కలిసి చూడగలిగేలా (వినగలిగేలా కూడా) ఉండాలి. చాటుగా, ఇయర్ ఫోన్స్ వాడాల్సిన విధంగా ఉండకూడదు కదా!**

తీసే వాళ్లు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా - ఆ 'మసాలా' లేకపోతే వాళ్ల వీడియోలు ఎవరూ చూడరు. వాళ్లకంత పాపులారిటీ రాదన్నది వాస్తవం.



### యూట్యూబ్ ప్రోత్సాహం ఎంత?

అశ్లీలాన్ని తాము సమర్థించమని, ఎప్పటికప్పుడు అడల్ట్ కంటెంట్‌ని వడపోస్తామని యూట్యూబ్ చెబుతుంది. కానీ, ఆ వడపోతని దాటిన వీడియోలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి. ఒక్కసారి తెలిసో, తెలియకో అలాంటి వీడియో చూస్తే చాలు... దాన్ని మన ఆసక్తి కింద లెక్కేసుకుని, అలాంటి వీడియోలని వెతకనక్కర్లేకుండా హోం పేజీలో చూపించేస్తుంటుంది.

వెండి తెర మీద ప్రదర్శితమయ్యే సినిమాలకి ప్రత్యేకంగా సెన్సార్ బోర్డ్ అంటూ ఒకటి ఉండి కూడా నానా చెత్తంతా వచ్చిపడుతోంటే... ఇక, సెన్సార్ అనేదే లేకుండా, చేతిలోనే అన్నీ చేసేయగలిగే వీలున్నపుడు ఎంత ఛండాలం వచ్చిపడాలి?

అణ్వాయుధాల తయారీ కూడా యూట్యూబ్‌లో చూసి నేర్చుకోగలిగే ఈరోజుల్లో యూట్యూబ్‌కి సెన్సార్ అనేది ఖచ్చితంగా ఉండాల్సిందే. అది ఉంటే పూర్తిగా కాకపోయినా... దరిద్రంలో కాస్తయినా వడపోత అయ్యే అవకాశం ఉంది కదా!

# ఎలా రాస్తారండీ బాబూ...!

భరత్ రుషి

(గత సంచిక తరువాయి...)

♦ **తెలిసెనే... *(అర్జున్ రెడ్డి)***

అర్జున్ రెడ్డి - విశ్లేషణ, వివాదాలు పక్కనపెడితే... పాటలన్నీ బావుంటాయి. ప్రేమ జంటలకూ, విఫల ప్రేమికులకూ పనికొచ్చే పాటలన్నీ అందులో ఉంటాయి. సంగీతం, సాహిత్యపరంగా బెస్ట్ అని చెప్పొచ్చు. ప్రేమలో దెబ్బ తిన్న అబ్బాయిలకైతే - తెలిసెనే పాట ఆల్‌టైమ్ ఫేవరెట్. సంగీత ప్రియులకైతే చెప్పనే అక్కర్లేదు.



*తెలిసెనే.. నా నువ్వు నా నువ్వు కాదనీ...*
*తెలిసెనే.. నీ నేనే నీ నేను కాదనీ...*

మనం ఎవర్నైతే 'నా' అనుకుంటామో... ఎవరికైతే మనం సొంతమనుకుంటామో... ఏదో ఒక క్షణంలో అది నిజం కాదని తెలిస్తే... మనలో ఏదో కోల్పోయిన భావన... మనలోంచి ఏదో వెళ్లిపోయిన వేదన...

*నాలో సగం ఇక లేదూ అనీ..*
*నా నిన్నలే నను చూసి నవ్వేలే...*
*మరునాడు అన్నదే... ఇక ఉండబోదనీ..*
*అన్నదీ క్షణం....*

ప్రతీ రోజునీ వాళ్ల ఆలోచనలతో మేల్కొలిపి, వాళ్ల జ్ఞాపకాలతోనే పూర్తయ్యేంతగా వాళ్లని మనలో కలిపేసుకుంటే... అలాంటి రేపు ఇక ఉండదని తెలిస్తే...

వాళ్లే మనం..మనమే వాళ్లని ఎన్ని ఊహించుకుంటాం? వాళ్లతో జీవితాన్ని ఎంత అందంగా ప్లాన్ చేసుకుంటాం? అదంతా వట్టిదే అని తెలిస్తే...

*ఊహలకే తెలియనిదే జరిగెనులే.. ఇప్పుడెలా*
*నువ్వూ-నేనూ అను మాటే ఇకపై ఉండదులే ఏంటిలా*
*తప్పు ఏదో జరిగెలే రెప్పపాటులో...*
*చెప్పలేని వేదనగా - ఉప్పెనల్లే తరుముతోందే*

---

♦ **చూసీ చూడంగానే... *(ఛలో)***



ప్రేమలో ప్రతీ అనుభూతి అద్భుతంగా ఉంటుంది. అందులో తొలి చూపు ప్రేమ అయితే అది ఇంకా వేరే ఉంటుంది. ఆకర్షణలైనా, ప్రేమలైనా తొలిచూపులోనే మొదలవుతాయి. దానికి దానికి అమ్మాయిలు, అబ్బాయిలన్న తేడా ఏం లేదు. కాకపోతే, అబ్బాయిలు దాచుకోలేక బయటపడిపోతారంతే.

*చూసీ చూడంగానే నచ్చేసావే...అడిగీ అడగకుండా వచ్చేసావే...*
*నా మనసులోకి...అందంగ దూకి!*
*దూరం దూరంగుంటూ ఏం చేసావే...దారం కట్టి గుండె ఎగరేసావే*

*ఓ చూపుతోటీ...ఓ నవ్వుతోటీ..!*

చూడగానే నచ్చింది. నచ్చగానే వెనకలే తిరుగుతాడు అబ్బాయి. ఆ గమనంలో తన ప్రతీ కదలికా అద్భుతమే..తన గురించిన ప్రతీ చిన్న వివరమూ గొప్ప విశేషమే...

*నీ చిత్రిలూ ఒక్కోటీ చూస్తూ ఉంటే...*
*ఈ జన్మకు ఇది చాలూ అనిపిస్తుందే...*
*నువ్ నాకంటా పడకుండా...నా వెంటా పడకుండా ఇన్నాళ్ళెక్కడ ఉన్నావే!*


ఆ వెంటనే తన దృష్టిలో పడేలా ఏదో ఒకటి చేయాలనిపిస్తుంది. తన సంతోషం కోసం ఏదైనా చేసెయ్యాలనిపిస్తుంది.

*నీ కన్నుల్లో ఆనందం వస్తుందంటే...*
*నేనెన్నెన్నో యుద్ధాలూ చేస్తానులే...*
*నీ చిరునవ్వుకై నేనూ గెలుపొంది వస్తానూ..కానుక ఇస్తున్నానులే!*

---

♦ **ఇంకేం ఇంకేం కావాలే.. *(గీతా గోవిందం)***

మన జీవితంలోకి వచ్చే లేదా మనం రావాలనుకునే అమ్మాయి ఇలా ఉంటే బాగుండని ఎన్నో కలలు కంటాం. ఎప్పుడొస్తుందోనని ఎదురుచూస్తుంటాం. తను మనం ఊహించని విధంగా ఎదురొచ్చి, ఊపిరిలో ఊపిరిలా అల్లేసుకుంటే...



*ఊహలకు దొరకని సొగసా*
*ఊపిరిని వదలని గొలుసా*
*నీకు ముడిపడినది తెలుసా*
*మనసున ప్రతి కొస*

ఒక్క ప్రేమలోనే పదాల్లో చెప్పలేని ఊసులెన్నో... మనసు నుండి మనసుకి మౌనంగానే చేరిపోతాయి. అలాంటి క్షణాలే శాశ్వతమైపోతే - అది చాలు కదా ఈ జన్మకి! ఇంకా ఏమన్నా కావాలా!

*ఇంకేం ఇంకేం కావాలే..చాల్లే ఇది చాల్లే...*
*నీకై నువ్వే వచ్చి వాలావే...ఇకపై తిరణాళ్లే...*

ఈ వైపు ఇంత ఇష్టంతో మనం ఇదైపోతుంటే... ఆ వైపు ఏదో అపార్థంతో మనల్ని దూరం పెట్టేస్తే... మనల్ని ద్వేషిస్తుంటే భరించగలమా...

*మాయలకు కదలని మగువా...మాటలకు కరగని మధువా...*
*పంతములు విడువని బిగువా...జరిగినదడగవా...*

అర్థం చేసుకోకున్నా ఫర్లేదు. మనం చెప్పాలనుకున్నదేదో ఒక్కసారి వింటే బాగుండనిపిస్తుంది. ఊరకే అయినా, స్నేహంగా ఉంటే బాగుండనిపిస్తుంది.

*నా కథని తెలుపుట సులువా...జాలిపడి నిమిషము వినవా...*
*ఎందుకని గడికొక గొడవా...చెలిమిగ మెలగవా..*

(మరికొన్ని వచ్చే సంచికలో)

జ్ఞాపకం

## ఇంతలోనే ఎంత దూరం...

ఉన్నది చాలనుకున్నారో... ఇంకా
ఉండటం ఎందుకనుకున్నారో...
హఠాత్తుగా నిష్క్రమించారు

ఇచ్చింది ఎక్కువనుకున్నారో... ఇక
ఇవ్వనక్కర్లేదనుకున్నారో...
చేతులు ముడిచేసుకున్నారు

కొన్ని సందర్భాల్లో 'మీరుండాలి' అనిపిస్తుంది
మరి కొన్ని సందర్భాల్లో 'మీరుంటే
మరోలా ఉండేదీ సందర్భం' అనిపిస్తుంది

తలచుకున్నప్పుడల్లా మనసులో శూన్యం...
మీరు తప్ప మరెవ్వరూ పూరించలేనిదీ...
మేమెవ్వరం భరించలేనిదీ...

మీరు మా నుండి దూరమై
అప్పుడే ఏడాది గడిచిపోయింది
కాలం ఇంత వేగంగా పరిగెడుతోందా...?
మీరు లేకుండానే ఇంత కాలం గడిచిందంటేనే
అసలు నమ్మలేకుండా ఉన్నాము
**తేదీ, వారం, నెలా.. ప్రతీ సంవత్సరం తిరిగొచ్చినట్టే**
**మీరూ తిరిగొస్తే... ఎంత బాగుండు !!!**



కీ.శే. దేవులపల్లి వేణుగోపాల్ గారు


మేనేజింగ్ పార్ట్నర్, సిటి కేబుల్, బెల్లంపల్లి

మరణం: 16.06.2018

(కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, మరియు సిటి కేబుల్ సిబ్బంది)

## మీకు నచ్చే యూట్యూబ్ ఛానల్స్

మిమ్మల్ని ఉత్సాహపరిచే, విజయం వైపు నడిపించే ఉత్తేజకరమైన వీడియోలు, లేటెస్ట్ వాట్సప్ స్టేటస్‌లు, ఇతర వీడియోల కోసం




షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు మరియు
బెల్లంపల్లికి సంబంధించిన ప్రత్యేక వీడియోల కోసం




**సబ్ స్క్రైబ్ చేసుకోండి...కొత్త వీడియోల నోటిఫికేషన్ కోసం బెల్ ఐకాన్‌ని క్లిక్ చేయండి**

### రచనలకు ఆహ్వానం

'జాగో ఆన్‌లైన్ ప్రెస్' పత్రిక కోసం విద్యార్థుల నుండి రచనలని ఆహ్వానిస్తున్నాము. మీ భావాలకూ, ఆలోచనలకూ అక్షర రూపం ఇవ్వండి. కథ, కవిత, గేయం... ఇలా మీ రచన ఏదైనా, సొంతంగా, తెలుగులో రాసినదై ఉండాలి.
ప్రతీ రచనకి హామీపత్రం తప్పనిసరి.
మీ జీవితంలో మీకెదురైన సరదా సంఘటనలను కూడా పంపొచ్చు.
వ్యాఖ్యానం ఆసక్తి ఉన్న విద్యార్థులు తాము రాసిన లేదా విన్న కథ/కవిత/పాటలను అభినయ పూర్వకంగా వివరించవచ్చు. వాటిని చిత్రీకరించి, 'జాగో ఆన్‌లైన్ ప్రెస్' యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుంది.

'జాగో ఆన్‌లైన్ ప్రెస్' ని ఆన్‌లైన్ లో చదివేందుకు మరియు ఇతర పోస్టులు, వీడియోల కొరకు వెబ్‌సైట్

**https://jaagoonline.wordpress.com/**

మరియు

యూట్యూబ్ ఛానెల్

**jaago online press** చూడండి.

ఎడిటర్, డిజైనర్ భరత్ రుషి
సబ్ ఎడిటర్, పబ్లిషర్ అశోక్ పోతుగంటి

బెల్లంపల్లి నుండి ప్రచురితము

మీ రచనలు, పత్రికపై అభిప్రాయాలు, సూచనలు కింది మెయిల్‌కి పంపండి.

jaago2409@gmail.com